ఊరూరా బెల్టు జోరు



కూటమి ప్రభుత్వ అధికారం అండతో కాసుల కోసం తెలుగు తమ్ముళ్లు గమ్మత్తు దందాకు తెరతీశారు. ఎక్సైజ్ అధికారుల సహకారంతో ఊరూరా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఒక దుకాణానికి అనుమతులు తీసుకుని అనధికారికంగా రెండు, మూడు నిర్వహిస్తూ నిరుపేదల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు మాత్రం మద్యం అక్రమంగా విక్రయించినా.. బెల్టుషాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామంటూ ప్రచార ఆర్భాటం తప్ప ఆచరణ ఎక్కడా కనిపించడం లేదు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. – సాక్షి టాస్క్‌ఫోర్స్

- పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు
- కాల్ చేస్తే... డోర్ డెలివరీ
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

వడమాలపేట మండలంలో ఊరూరా బెల్టు షాపులు నడుస్తున్నాయి. లాటరీ ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న నేతలు... ఆ దుకాణానికి అనుబంధంగా ఊరూరా బెల్టు షాపులు ఏర్పాటు చేసుకొని దండుకొంటున్నారు. క్వార్టర్‌పై రూ.20 నుంచి 30 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు.

జోరుగా మద్యం దందా

వడమాలపేట మండలంలో నాలుగు మద్యం షాపులు ఉన్నాయి. మొత్తం 22 పంచాయతీలు ఉండగా 100కి పైగా గ్రామాలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీకి రెండు, మూడు చొప్పున మొత్తం 50కిపై బెల్టు షాపులు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్లు మద్యాన్నే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఊరూరా ఏరులై పారిస్తూ జేబులో వేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపగా, ఇప్పుడు గ్రామగ్రామానా బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి. మద్యం అక్రమ రవాణా కూడా జోరుగా సాగుతుండడంతో వడమాలపేట మండలం మరో గోవాను తలపిస్తోందని విమర్శిస్తున్నారు.

24 గంటల సర్వీస్

నిబంధన ప్రకారం మద్యం షాపు పక్కన ఎలాంటి డాబాలు ఉండకూడదు. అయితే ప్రతి మద్యం షాపు పక్కన రెస్టారెంట్‌ను తలపించేలా డాబాలు నిర్వహిస్తూ, 24 గంటలు మద్యం విక్రయిస్తున్నారు. ఇందులో వచ్చే లాభంలో నెలనెలా ఎక్సైజ్ అధికారులకు ఒక షాపునకు రూ.20 వేలు చొప్పున నాలుగు మద్యం షాపు వారు రూ. 80 వేలు మామూళ్లు అందిస్తుండడంతో అధికారులు, సిబ్బంది మౌనం వహిస్తున్నారని విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. గంజాయి, నాటు సారాపై దాడి చేశామని చెప్పుకొనే అధికారులు బెల్టు షాపులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాటు సారా కంటే, బెల్టు జోరుగా సాగుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటు సారాతో పాటు, బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

డాబా వద్ద గొడవలు

మద్యం షాపు పక్కన ఉన్న డాబాలో నిత్యం గొడవలు జరుగుతున్నాయని, మద్యం తీసుకొన్న యువకులు పక్కన ఉన్న డాబాల్లో ఫుల్‌గా తాగి, మద్యం మత్తుల్లో యువకులు గొడవలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటన పలుమార్లు జరిగినా వాటిని బయట తెలియకుండా మద్యం షాపు యజమాన్యం మేనేజ్ చేస్తూ వస్తున్నాయని, యువకు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇలా ఇరు వర్గాల వారు గొడవలు పడి ఆసుపత్రి పాలైన సంఘటన ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా మద్యం షాపు పక్కన ఉన్న డాబాలను వెంటనే తొలగించడమే కాకుండ ఊరులో ఉన్న బెల్టుపై నిఘా పెట్టాలని మహిళలు కోరుతున్నారు.

కోత దశలోని మామిడిని మాత్రమే తరలించండి



మామిడి కాయల దిగుమతిని పరిశీలిస్తున్న తహశీల్దార్

కార్వేటినగరం: కోత దశకు వచ్చిన మామిడి కాయలను మాత్రమే ఫ్యాక్టరీలకు తరలించాలని మండల తహశీల్దార్ నాగరాజు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని అన్నూరు వద్ద ఉన్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీని తహశీల్దార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండు దశలో ఉన్న వాటిని మాత్రమే కోయాలని, పర్మిట్ల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి రైతుకు యాజమాన్యం సకాలంలో అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఫ్యాక్టరీ యాజమాన్యానికి సహకరించాలని సూచించారు. రైతు నాగేశ్వరరాజు, రైతులతో కలసి ఫ్యాక్టరీ యాజమాన్యంతో సంప్రదించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పర్మిట్లు పంపిణీ చేయాలని యాజమాన్యానికి తెలిపారు.

క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

నింద్ర: మండలంలోని ఉపాధి పథకం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో గ్రామాల్లో చేపట్టిన వివిధ రకాల పనులను తనిఖీ చేసిన నివేదికలను సమావేశంలో చదివి, వినిపిస్తారని తెలిపారు. సమావేశానికి అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యోగా ప్రాచీన సంస్కృతి



యోగాసనాలు చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పుత్తూరు: యోగా భారతదేశంలో వేయి సంవత్సరాల ముందే పుట్టిందని, యోగాతో శారీరక మానసిక రుగ్మతలు తొలగుతాయని డాక్టర్ బి. చంద్రమౌళి అన్నారు. యోగాంధ్ర-2025వ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో యోగాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో అనేక లాభాలు ఉన్నాయని, కులమతాలకు అతీతంగా అందరూ యోగ అభ్యసించవచ్చన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, వి.వీరయ్య, ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ ఎ.దేవకి, శాంసన్ రాజు, టి.నరసింహులు, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ పి.వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నింద్ర: మండలంలో ప్రతి గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ అన్నారు. గురువారం మండల కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. శనివారం ప్రతి గ్రామంలోని సచివాలయం, పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలన్నారు. యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేషగిరిరావు, ఎంఈఓ వసుమతి, శ్రీధర్‌రాజు, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరాల బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

పాలసముద్రం: మండలంలోని ఏడో నంబర్ రేషన్ షాపు ఎదుట ఏర్పాటు చేసిన నేమ్ బోర్డుపై ఇదేమి బోర్డురా బాబూ అనే శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. వార్తపై స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ రిషివర్మ ఏడవ నంబర్ రేషన్ షాపును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చౌక దుకాణం ఎదుట నిత్యావసర వస్తువుల పట్టిక బోర్డుని ఏర్పాటు చేశారు. ఆయన వెంట నరసింహులు, వాచ్‌మెన్ వెంకటేశులు ఉన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓని సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

పాలసముద్రం: మండలంలో నూతనంగా విధులు చేపట్టిన ఎంపీడీఓ సతీష్‌కుమార్‌కి గురువారం జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, ఎంపీపీ శ్యామల శివప్రకాష్ రాజు, సర్పంచ్, ఎంపీటీసీలతో కలసి సన్మానించారు. ఎంపీడీఓ సతీష్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసికట్టుగా పని చేస్తే మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో లోపాలను ఎంపీపీ శ్యామల ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లిఖిత, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్ బాబు, అయ్యపన్, శోభ, జీవిత, నరసింహరాజు, నాగమ్మ, మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, సుధ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ శ్రేణులు

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన పంచాయతీ నంబాల పల్లె గ్రామంలో వైఎస్సార్ సీపీ బూత్‌కమిటీ నియోజకవర్గ కన్వీనర్ నారాయణరెడ్డి పెద్దనాన్న వెంకటరెడ్డి చిత్ర పటానికి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఘనంగా నివాళులర్పించారు. గురువారం వెంకటరెడ్డికి కర్మక్రియలు జరగడంతో గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, మాజీ ఎంపీపీ పురుషోత్తం, పెనుమూరు మండల అధ్యక్షుడు విజకుమార్‌రెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలు యశోద, మాజీ మండల అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, చిరంజీవి రెడ్డి, గోవిందన్, కార్యదర్శి బొజ్జారెడ్డి, మాజీ ఎంపీటీసీలు ధనుంజయరెడ్డి, బాబు, సర్పంచ్ గోవిందయ్య, మాజీ సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పురంధర్‌రెడ్డి, వెంకటేశ్, కమలాకర్‌రెడ్డి, దూది మోహన్, కాళప్ప, ప్రభాకర్‌రెడ్డి, పెద్దబ్బరెడ్డి ఉన్నారు.

ఐటీఐ రెండో విడత అడ్మిషన్లు

కార్వేటినగరం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ఉన్న వివిధ ట్రేడ్‌లకు రెండో దశ ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని ప్రభుత్వ పారిశ్రామిక సంస్థ(ఐటీఐ)లో ఉన్న అనేక రకాల ట్రేడ్లలో ఉన్న ఖాళీలకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జూలై 15 లోపు ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పదో తరగతి మార్కుల లిస్టుతోపాటు ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా మహిళలకు కంప్యూటర్, టైలరింగ్ ట్రేడ్లలో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చే నెల 21వ తేదీ కార్వేటినగరం ఐటీఐ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

విజయపురంలో...

విజయపురం: మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ భైరవుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలోని వివిధ ట్రేడ్లలో మిగిలిన సీట్లకు అభ్యర్థులు జులై నెల15వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గ్రావెల్ తరలింపు ప్రాంతం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం: మండలంలోని తమిళనాడు సరిహద్దులో బాలక్రిష్ణాపురం పంచాయతీ అలిపుల గుంట సమీపంలో గుట్టలనే మింగేస్తున్నారు అని సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో దీనిపై స్పందించిన తహశీల్దార్ అరుణ కుమారి తమ సిబ్బందితో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్రమంగా హిటాచీతో టిప్పర్లలో గ్రావెల్ మట్టి తీసుకెళ్తున్న ఒక బండి కూడా కనిపించ లేదు. అధికారులు వస్తున్నారనే విషయం తెలుసుకున్న తమిళనాడువాసులు పరారైపోయారు. అయితే అక్కడ కొన్ని రోజులుగా ఎర్రమట్టి అక్రమ రవాణా జరిగిందని గుర్తించారు. గ్రామస్తులతో తహశీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ ఇకపై ఎవ్వరైపా గుట్టలో ఎర్రమట్టిని తీస్తుంటే వెంటనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రావెల్ ఎర్రమట్టి తీసుకుని వెళ్లకుండా గుట్ట పైకి బండ్లు రాకుండా జేసీబీతో ట్రెంచ్ కొట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, వీఆర్‌ఓలు తంగరాజ్, వెంకటాచలం, రమణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

పెనుమూరు(కార్వేటినగరం): ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాఖ ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు అన్నారు. గురువారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ మార్చి ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఎస్.యామిని వెయ్యి మార్కులకు 974 మార్కులు సాధించి కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిందన్నారు. అమరావతిలో విట్ కళాశాలలో ఫ్రీసీటు దక్కించుకుందన్నారు. అలాగే మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎస్.కళ్యాణి, ఎ.రుచిత జిల్లా స్థాయిలో టాపర్లుగా రాణించారన్నారు.

పిల్లలను బడిలోనే ఉంచాలి

విజయపురం: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకమరాజు అన్నారు. గురువారం శ్రీహరిపురం యానాది కాలనీ ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో నమోదు చేశారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు సర్వేపల్లి విద్యామిత్ర కిట్ అందించారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం

రోడ్డు వెడల్పు చేయండి



బుగ్గ నల్లాటూరు మలుపు

నగరి: మండలంలోని బుగ్గ అగ్రహారం నుంచి నల్లాటూరు వెళ్లే మలుపు వద్ద రోడ్డు ఆక్రమణల కారణంగా రోజురోజుకూ కుంచించుకు పోతోంది. దీంతో మలుపుల్లో అవతలివైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించక పోవడంతోపాటు పెద్ద వాహనాలు మలుపు తిరిగేందుకు శ్రమపడాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


పాఠశాల స్థాయి తగ్గిస్తే ఊరుకోం!



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

వెదురుకుప్పం: గతంలో మా గ్రామంలో ఉన్న పాఠశాలలో 8వ తరగతి వరకు నడిచేదని ప్రస్తుతం దాన్ని 5వ తరగతి వరకు తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థులకు శాపంగా మారిందని మండలంలోని యనమలమంద గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గ్రామంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో వంద మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పాఠశాలను స్థాయి తగ్గించి 5వ తరగతి వరకే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో నిరసన వ్యక్తమవుతోంది. విద్యార్థులు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆళ్లమడుగు జెడ్పీ హైస్కూల్‌కి వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. గ్రామస్తుల ఆందోళనకు మద్దతుగా వైఎస్సార్ సీపీ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా నిర్వహిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. గ్రామంలో నిరసన సమాచారాన్ని తెలుసుకున్న ఎంఈఓ దామోదరం పాఠశాలను సందర్శించారు. సమస్యపై కలెక్టర్‌కి నివేదిక పంపుతానని గ్రామస్తులకు తెలియజేశారు.

కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



వైఎస్సార్ సీపీ సంచికను ఆవిష్కరిస్తున్న జీడీ నెల్లూరు మండల నాయకులు

గంగాధరనెల్లూరు: మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ ప్రచురించిన సంచికను గురువారం మండల కేంద్రంలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు కేఆర్ వెంకటరెడ్డి మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని, సంవత్సరం గడుస్తున్నా హామీలను నెరవేర్చడానికి ముందుకు రాలేదని మండిపడ్డారు. మామిడి రైతుల గోడును ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇకనైనా ఇచ్చిన హామీలను నెరవేర్చే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముని రాజారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, వెంకటేష్‌రెడ్డి, వింజం గోవిందయ్య, హనీఫ్ బాషా, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.